1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | అక్టోబర్ 10, 2024 | www.navatelangana.com

మున్సిపల్ స్పెషల్ సెక్రటరీని కలిసిన కంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ శాఖ స్పెషల్ సెక్రటరీ దాన కిషోర్‌ను ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధుల కేటాయింపుపై చర్చించారు. నిధుల విడుదలకు హామీ ఇచ్చిన ఆయనకు కంది ధన్యవాదాలు తెలిపారు.

నారాయణ హాస్పిటల్ ప్రారంభోత్సవం

మంచిర్యాల: పట్టణంలోని గౌతమినగర్‌లో సొంత భవనంలో నారాయణ ఆసుపత్రిని డాక్టర్ కోటేశ్వర్‌రావు, విశ్వేశ్వర్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాలలోనే మొట్ట మొదటి మహిళ సర్జన్‌గా వైద్యరంగంలో విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ కళావతి గౌతమినగర్‌లో ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషకరమన్నారు. హైదరాబాద్ కార్పొరేట్ స్థాయిలో మంచిర్యాలలో ఆధునిక టెక్నాలజీతో ఆసుపత్రిని ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కళావతి మాట్లాడుతూ సాధారణ ప్రజలకు తక్కువ ధరలో వైద్యం అందాలనే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మల్లేష్, సుఖభోగి వెంకటేశ్వర్లు, డాక్టర్ మూర్తి, సల్మాన్‌రాజ్, రాంబాబు, కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ కాసర్ల యోహన్ పాల్గొన్నారు.



131 పోస్టులు ఖాళీ..!

- అభ్యర్థులు లేక మిగిలిపోయిన టీచర్ ఉద్యోగాలు
- ఉమ్మడి జిల్లాలో తాజాగా 1164 పోస్టులు భర్తీ
- ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేసిన ప్రభుత్వం
- దసరా తర్వాత సర్కారు బడులకు కొత్త ఉపాధ్యాయులు

కొన్ని మాధ్యమాల్లో ఉద్యోగాలు తక్కువగా ఉండి..అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారు. వాటిని దక్కించుకోవడానికి అపోసోపాలు పడుతుంటే.. ఉద్యోగాలు ఉండి కూడా కొన్ని సబ్జెక్టులకు అభ్యర్థులు లేని పరిస్థితి ఉమ్మడి జిల్లాలో కనిపిస్తోంది. తాజాగా ఉమ్మడి జిల్లాలో వివిధ కారణాలతో అభ్యర్థులు లేని కారణంగా 131 పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి. ఉమ్మడి జిల్లాలో డీఎస్సీలో 1295 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించగా.. ఇందులో కేవలం 1164 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. మిగితా వాటిలో మెరిట్ కం రోస్టర్ ప్రకారం అభ్యర్థులు లేని కారణంగా వృథాగా మిగిలిపోవడం చర్చనీయాంశంగా మారింది. టీచర్ పోస్టులను దక్కించుకోవడం కోసం అభ్యర్థులు తీవ్రంగా శ్రమించగా.. కొన్ని మాధ్యమాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో అర్హత కలిగిన అసలు అభ్యర్థులే లేకపోవడంతో విస్తుపోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఆయా మాధ్యమాల్లో ఉపాధ్యాయుల నియామకం జరగకపోవడంతో విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది.



హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఎట్టకేలకు ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ అయ్యాయి. ఏడేండ్ల తర్వాత నిర్వహించిన తాజా డీఎస్సీతో సర్కారు బడులకు కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. డీఎస్సీ -2024 ద్వారా ఉమ్మడి జిల్లాలో 1164 మంది ఉపాధ్యాయుల నియామకం జరిగింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాదులో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలను అందించారు. ఇటీవల ఐదు రోజుల పాటు 1:3 పద్ధతిలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించిన అధికారులు జాబితాను ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం మెరిట్ కం రోస్టర్ ప్రకారం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపించింది. కానీ ఉర్దూ మాధ్యమంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఆయా పోస్టులు కొన్ని ఖాళీగా ఉండిపోయాయి. మరోపక్క స్పెషల్ ఎడ్యూకేషన్‌కు సంబంధించి కూడా భర్తీ కాకుండా మిగిలిపోయాయి. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో స్పెషల్ ఎడ్యూకేషన్‌కు సంబంధించి కొన్ని పోస్టులు భర్తీకాగా మంచిర్యాల, నిర్మల్ జిల్లాలో మాత్రం ఎస్ఏ, ఎస్టీజీ విభాగాల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ కాకపోవడం గమనార్హం.

మిగిలిపోయిన పోస్టులు 131..!

ఉమ్మడి జిల్లాలో 1295 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించగా.. తాజాగా 1164 పోస్టులు మాత్రమే భర్తీకి నోచుకున్నాయి. మరో 131 పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలో 324 పోస్టులకు 296 పోస్టులు భర్తీ అయ్యాయి. మరో 28 పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 341 పోస్టులకు గాను 314 పోస్టులు భర్తీ అయ్యాయి. మరో 27 పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. మంచిర్యాల జిల్లాలో 288 పోస్టులు భర్తీ కానుండగా 255 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. మిగితా 33 పోస్టులు అలాగే ఉండిపోయాయి. నిర్మల్ జిల్లాలో 342 పోస్టులు భర్తీ కావాల్సి ఉండగా 299 పోస్టులు భర్తీ అయ్యాయి. మరో 43 పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి.

సర్కారు బడులకు కొత్త ఉపాధ్యాయులు..!

నూతన ఉపాధ్యాయుల నియామకం పూర్తికావడంతో దసరా సెలవుల అనంతరం సర్కారు బడులకు అందుబాటులోకి రానున్నారు. ఇన్నాండ్లు ఉపాధ్యాయుల లేమితో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రభుత్వ పాఠశాలలకు కొత్త ఉపాధ్యాయుల రాక ఉపశమనం కలిగిస్తోంది.

ఇది వరకు 2017లో టీఆర్‌టీ ద్వారా ఉమ్మడి జిల్లాలో 1582 పోస్టులు భర్తీ అయినప్పటికీ అనేక బడుల్లో ఖాళీల కొరత తీరలేదు. తాజా డీఎస్సీ జిల్లాల వారీగా నిర్వహించడంతో కొంత వరకు కొరత తీరే అవకాశం ఉన్నప్పటికీ.. ఇటీవల బదిలీలు, పదోన్నతులతో పాటు అనేక మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందడంతో అనేక ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిని పరిగణనలోకి తీసుకొని ఇటీవల విద్యాశాఖ లెక్కలు తీయగా.. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే 625 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. తాజా డీఎస్సీలో 296 పోస్టులు భర్తీ అయినప్పటికీ..మరో 329 పోస్టులు ఖాళీగా మిగిలిపోవడం విద్యాశాఖను కలవర పెడుతోంది. త్వరలోనే మరో డీఎస్సీ నిర్వహించడం.. లేదంటే తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించి బోధన చేపడితేనే సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేదంటే కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేక నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి







నవతెలంగాణ-లోకేశ్వరం

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి చెందిన ఘటన నర్సాపూర్(జి) మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం..లోకేశ్వరం మండలం మన్మథ్ గ్రామానికి చెందిన సంఘం సురేష్(28), భార్య ప్రియాంక(26), కుమారుడు సాయివర్షిక్ (6), కూతురు తనిష్క(4))తో కలిసి అత్తగారిల్లు బోథ్ మండలం కుచ్లాపూర్ గ్రామానికి మంగళవారం వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం మన్మథ్ గ్రామానికి కారులో వస్తున్నారు. ఈ క్రమంలో నర్సాపూర్(జి) మండలం తురాటి గ్రామ సమీపంలో జాతీయ రహదారి 61పై కారు ముందు టైరు బ్లాస్ట్ కావడంతో వేగంలో ఉన్న కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. దీంతో కుమారుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ సురేష్‌తో పాటు భార్య కూతురును చికిత్స కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సురేష్ మృతి చెందినట్టు నిర్ధారించారు. భార్య ప్రియాంక కుడి కాలు విరగడంతో పాటు బలమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి అత్త మచ్చెర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు. సురేష్ గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించేవాడు. తండ్రీకొడుకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


ఉపాధి పనులపై సామాజిక ప్రజావేదిక



నవతెలంగాణ-ముధోల్

ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం డిఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధి హామీ ప్రజా వేదిక నిర్వహించారు. 2023-24కు సంబంధించి మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 358 పనులకు రూ.3.09కోట్లకు పైగా ఉపాధి హామీ పనులు చేసినట్లు తెలిపారు. ఆ పనులను సెప్టెంబర్ 28 నుంచి ఈ నెల 7వరకు అధికారుల బృందం సామాజిక తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ తనిఖీలో హరితహారంలో భాగంగా పెంచిన మొక్కలు చనిపోయినట్లు గుర్తించారు. ఆ మొక్కల స్థానంలో కొత్త మొక్కలను తిరిగి పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పనికి రాకున్నా వచ్చినట్లు చూయించి డబ్బులు లేపినట్లు ప్రజావేదికలో వెల్లడైంది. పనుల పట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం, రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం తదితర లోపాలు జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాలలో చేపట్టిన పనులలో నిర్లక్ష్యంతో పంచాయతీ కార్యదర్శుల నుండి రూ.14,740 రికవరీ చేసినట్లు డీఆర్డీఓ తెలిపారు. అలాగే టిఎలకు రూ.4830, ఎఫ్ఎలకు రూ.6962 రికవరికి ఆదేశించారు. మొత్తం రూ.30,691 రికవరికి ఆదేశించినట్లు చెప్పారు. అలాగే రూ.2000 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి భగవంత్‌రావ్, ఎపిఓ శిరీషారెడ్డి, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలు సాధించిన కానిస్టేబుల్ భార్య



నవతెలంగాణ - కాసిపేట

స్థానిక పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ మీనుగు రాజు భార్య శ్రావిక మూడు ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. బెల్లంపల్లికి చెందిన రాజుకు 2018లో హన్మకొండకు చెందినే శ్రావికతో పెళ్లి జరిగింది. పెళ్లికి ముందు డీఈడీ చేసిన ఆమె తనకు చదువుపై ఉన్న ఇష్టాన్ని గుర్తించి భర్త బీఈడీ, పీజీ ఇంగ్లీష్ చదివించాడు. వీరికి ఇద్దరు మగ పిల్లలున్నారు. ఇంటి బాధ్యతలు చూస్తూనే మరో వైపు చదువును సాగించారు. కష్టపడి చదవి గతేడాది గురుకుల పీజీటీ, టీజీటీ రెండు పోస్టులు సాధించింది. దీంట్లో మల్టీజోనల్ పోస్ట్ కింద గురుకులంలో గత జూలై 25న కాగజ్‌నగర్‌లోని గన్నవరం జ్యోతిబాపూలే గురుకులంలో పీజీటీ ఇంగ్లీష్ ఉద్యోగంలో చేరింది. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లోనూ ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. పెళ్లి పదేళ్ల తర్వాత కూడా కుటుంబ బాధ్యతల నడుమ మూడు ఉద్యోగాలు సాధించడం పట్ల శ్రావిక పట్టుదలను పలువురు అభినందిస్తున్నారు. బుధవారం హైదరాద్‌లో నియామక పత్రాన్ని స్వీకరించారు. ఎస్ఏ ఉద్యోగం సాధించిన ఆమెను కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

విద్యారంగ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా

- టీచర్ ఎమ్మెల్సీగా అశీర్వదించండి : కడారి అనంతరెడ్డి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించి అశీర్వదిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యారంగ సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతనిస్తానని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆమోదిత పాఠశాలల యాజమాన్య సంఘం(ట్రస్మా), ఇతర సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. త్వరలో జరుగనున్న శాసన మండలి ఎన్నికల్లో టీచర్ ఎమ్మెల్సీగా తాను బరిలో ఉంటానని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల అండదండలతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేయడం ఖాయమని వెల్లడించారు. కరీంనగర్‌లో 1986 నుంచి 39 సంవత్సరాలుగా మానేరు విద్యాసంస్థలను నెలకొల్పి వేలాది మంది విద్యార్థులను సమాజానికి అందించానని, సేవ రంగంతో పాటు స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తూ సమాజంలో పాలుపంచుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, ఉపాధ్యాయ, అధ్యాపకులకు సంబంధించిన విషయాలను పరిష్కరించడమే లక్ష్యంగా శాసన మండలిలో గళం విన్పిస్తానని పేర్కొన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని, కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, సరిపడా సబ్జెక్ట్ టీచర్లు వంటి అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలలకు విద్యుత్ సరఫరా, ఆస్తిపన్ను మినహాయింపు తదితర వాటి కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో కొన్ని రాయితీలు కల్పించాలని అన్నారు. జీఓ 317 సమస్యను పరిష్కరించడంతో పాటు పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ అమలుపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. విద్యారంగానికి పెద్దపీట వేసే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయింపజేసి నాణ్యమైన విద్యను సమాజానికి అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అరుకాల రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోల్ బెల్ట్ ఏరియా కన్వీనర్ రాజయ్య, పెద్దపెల్లి జిల్లా ట్రస్మా అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, తిరుపతి స్వామి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక సందర్శన



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిదీ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని పీహెచ్‌సీ డాక్టర్ సద్దాంకు సూచించారు. స్థానికంగా సాధారణ ప్రసవాలు చేయకపోవడంతో గర్భిణులు నిర్మల్, ఆదిలాబాద్‌కు వెళ్తున్నారని తెలిపారు. డెలివరీ కేసులు ఆసుపత్రికి వచ్చేలా మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ రవీందర్ రాథోడ్, సూపర్వైజర్ స్వర్ణలత పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని డెలివరీ రూమ్, ల్యాబ్, ఫార్మసీ గదులను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆస్పత్రిలో ఉన్న రోగులను అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటిస్తూ నిరంతరం రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భీంరావ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబరం

- పువ్వులను పూజించడం తెలంగాణ గొప్ప సంస్కృతి
- ఎస్పీ డా.జి.జానకి షర్మిల

నవతెలంగాణ-నిర్మల్

ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబరమని, పువ్వులను పూజించడం తెలంగాణ గొప్ప సంస్కృతి అని ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం భరోసా కార్యాలయ ప్రాంగణంలో జిల్లా పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ బతుకమ్మకు పూజ చేసి సంబరాలు ప్రారంభించారు. ఆడపడుచుల ఆట పాటలు, కోలాటాలతో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఎక్కడైన దేవుళ్లకు పూలు పెట్టి కొలుస్తామని, కానీ పువ్వులనే దేవతగా కొలిచే సాంప్రదాయం ఒక తెలంగాణలో మాత్రమే ఉందన్నారు. తెలంగాణ సంస్కృతికి చారిత్రక చిహ్నం బతకమ్మని, తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని తెలిపారు. పోలీసు కుటుంబ సభ్యులతో బతుకమ్మ ఆడటం, ఇంత మంది కుటుంబ సభ్యులను కలిసినందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే పండుగ బతుకమ్మను అత్యంత వైభవంగా జరుపుకోవాలన్నారు. జిల్లా ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మ జరుపుకుంటారన్నారు. ప్రకృతితో మమేకమయ్యే పండుగ బతుకమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎఎస్‌పి అవినాష్ కుమార్, జిల్లా ట్రెజరీ అధికారిణి సరోజిని, డిఎస్‌పి గంగారెడ్డి, పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు వారి కుటుంబ సభ్యులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.







పెసా చట్టంపై అవగాహన

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని ఆయా గ్రామాల్లో పెసా చట్టాన్ని అమలు చేయాలని మండల ప్రత్యేక అధికారి గంగాధర్ సూచించారు. ఈ సందర్భంగా బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పేసా చట్టంపై అవగాహన కల్పించారు. పారిశుధ్యం, ఉపాధి హామీ పనులు, నర్సరీ, గ్రామాభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జవహర్ లాల్, తహసీల్దార్ రాజలింగం, ఏపీఓ జాదవ్ సురేష్, ఎంపీఓ స్వప్న షీలా, టీఏలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలో ఎమ్మెల్యే నివాసంలో బుధవారం లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందించారు. తలమడుగు మండలం ఖోడాద్ గ్రామానికి చెందిన జి.నరేష్ రూ.29,000, ఇచ్చోడ మండలంలోని కామగిరి గ్రామానికి చెందిన బి.లక్ష్మణ్‌కు రూ. 42,000 మంజూరు కాగా చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అందించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికి అనేక పథకాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మిక శాఖ ద్వారా కార్మికుల సంక్షేమమం కోసం అనేక పథకాలున్నాయని వాటి గురించి తెసుకుంటు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత లెబర్ ఆఫీసర్ చిట్యాల జగదీష్ అన్నారు. బుధవారం దస్నాపూర్‌లోని సాగర్ సూపర్ మార్కెట్ వద్ద కార్మికులకు అవగాహన కల్పించారు. కార్మిక శాఖ అందించే సేవలు, పథకాలు వాటి ఉపయోగం, దరఖాస్తు విధానాలను వివరించారు. అనేక ఏండ్లుగా కార్మిక శాఖ కార్మికుల సంక్షేమమం కోసం పథకాలను అమలు చేస్తుందని, వాటి గురించి తెలియక లబ్దిపొందలేకపోతున్నారని జగదీష్ అన్నారు. కార్మికులు క్షేత్రస్థాయిలో వీటి గురించి తెలియజేయాలని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఎలాంటి సందేహమున్న తనను సంప్రదించవచ్చని తెలిపారు.

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కిషన్

నవతెలంగాణ -ఖానాపూర్



పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యఖక్షుడిగా కడెం మండలంలోని జెడ్‌పీఎస్ఎస్‌లో జీవ శాస్త్రం టీచర్‌గా పనిచేస్తున్న వీ.కిషన్ ఎన్నికయ్యారు. 2019, 2021, 2024లో రాష్ట్ర కార్యవర్గంలో వరుసగా మూడు సార్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేంద్రబాబు, బీవీ.రమణ రావు, రాష్ట్ర అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కోట వేణు, కడెం అధ్యక్షుడు బీ.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బీ.మహేష్ అభినందించారు.

కరాటే క్రీడనే కాదు.. ఆత్మరక్షణ విద్య



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కరాటే ఒక క్రీడనే కాదు అది ఆత్మరక్షణ విద్య అని గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో అండర్ 14, 17 బాలబాలికల పోటీలు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అథితిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కరాటే అంటే అందరు క్రీడగా భావిస్తున్నారని, ఇది ఆత్మరక్షణకు సంబంధించిన విద్య అని గుర్తించాలని పార్థసారథి అన్నారు. జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభకనబర్చాలని ఆకాంక్షించారు. ఈనెల 14న మంచిర్యాలలో జరిగే జోనలాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడకారులను పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ వీరేష్, కృష్ణారావు, వనిత, శివయ్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కంటి చూపు దినోత్సవం



నవతెలంగాణ-ఖానాపూర్

ప్రపంచ కంటి దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం నుండి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. బోస్లె గోపాలరావు పాటిల్ ఐకేర్ సెంటర్ ముధోల్, ఎల్వీ ప్రసాద్ ఐకేర్ ఇన్స్‌ట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పిల్లలకు మొబైల్ ఫోన్లను ఇవ్వకుండా క్రీడలు నేర్పాలని, మొబైల్ ఫోన్ చూడడం వల్ల కంటి చూపు మందగించే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కిషోర్ నాయక్, కుర్మా శ్రీనివాస్, నాయకులు జన్నరపు శంకర్, నాయిని సంతోష్, అమనూల్ల ఖాన్, షబ్బీర్ పాషా, కోఆర్డినేటర్లు సాయన్న, ఓం ప్రకాష్, డాక్టర్ వంశి మాధవ్, వైద్య, మెప్మా సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యతో ఎదుగుదల సాధ్యం



నవతెలంగాణ-నార్నూర్

విద్యతో ఎదుగుదల సాధ్యమని బంజారా యువసేన మండల నాయకులు జాదవ్ దత్త, గ్రామ సేవాలాల్ యూత్ ఎంప్లాయిస్ నాయకులు చౌహాన్ కిషోర్ అన్నారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థి జాదవ్ నవనీత్ ఎంబీబీఎస్‌లో మొదటి విడత కౌన్సెలింగ్‌లో వరంగల్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థిని స్వీట్ తినిపించి శాలువాతో సన్మానించారు. పేద కుటుంబంలో పుట్టి ఫ్రీ ఎంబీబీఎస్ సిట్ సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వివిధ యూత్ ప్రసిడెంట్ జాదవ్ జితేందర్, భోస్లె పరమేశ్వర్, గ్రామ పెద్దలు మహదవ్, ప్రకాష్, రాజేష్, జాదవ్ లింబాజి, విజయ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

నవతెలంగాణ-తాంసి

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో జై భవాని శారదా దేవి మండపం దగ్గర మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు సతీష్ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొమ్మిది రోజులు ఎంతో నియమనిష్టలతో మహిళలు ఉపవాస దీక్షలతో శారద దేవికి ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుంకుమార్చన అనంతరం అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.

సీపీఐ(ఎం) 13వ జిల్లా మహాసభలను
విజయవంతం చేయండి

- సీపీఐ(ఎం) కార్యదర్శి దర్శనాలమల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నవంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే సీపీఐ(ఎం) పార్టీ జిల్లా 13వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ కోరారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో మహాసభలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభలకు కేంద్ర, రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వందలాది మంది కార్యకర్తలు హాజరవుతున్నారని తెలిపారు. మొదటి రోజు పదివేల మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, చిరువ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో పేదలకు ఇండ్లస్థలాల కోసం ఉద్యమించి పట్టణంలో సుందరయ్య నగర్, రణదివే నగర్, భగత్ సింగ్ నగర్, వరలక్ష్మి నగర్, దుర్గానగర్ లాంటి అనేక వార్డులు నెలకొల్పిన చరిత్ర సీపీఐ(ఎం)కు ఉందన్నారు. మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ని పునరుద్ధరించాలని రెండేళ్లుగా ఐక్య పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఆదిలాబాద్ నుండి ఆర్మూర్‌కు రైల్వేలైన్, విమాశ్రయం ఏర్పాటు, టెక్స్‌టైల్స్ పరిశ్రమ స్థాపన, కేంద్ర యూనివర్సిటీ కోసం పోరాడుతున్నామని గుర్తు చేశారు. నోరులేని మనుషుల కోసం తన గళం విప్పుతున్నదన్నారు. ఆదివాసీ గుండెలకు రోడ్డు, తాగునీరు, విద్య, వైద్యం సదుపాయాల కోసం, దళితులకు అండగా పోరాడిన పార్టీ సీపీఐ(ఎం) అని అన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా అన్ని ఉన్న అల్లుడి నోట్లో చని అన్న సందంగా జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యానికి గురైన జిల్లాను పారిశ్రామికంగా, వ్యవసాయకంగా అభివృద్ధి చేసుకోవడానికి ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించడానికి వేదిక కానున్న జిల్లా మహాసభల జయప్రదానికి శ్రేయోభిలాషులను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, నాయకులు కె.ఆశన్న పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లు నిర్మాణానికి పెద్ద పీట

- ఎంపీ గోడం నగేష్
- రూ.30 కోట్లతో డబుల్ లైన్ రోడ్డుకు భూమి పూజ



నవతెలంగాణ-ముధోల్

కేంద్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణానికి పెద్ద పీట వేస్తామని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి వాస్తాపూర్ గ్రామం వరకు సీఆర్ఎఫ్ కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.30 కోట్లతో రహదారి నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సడక్ యోజన, సీఆర్ఎఫ్ నిధులతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో రోడ్లు నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం ద్వారా అత్యదిక నిధులు మంజూరు చేయటానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనే జాతీయ రహదారులు, అంతర్రాష్ట్రీయ రోడ్లు, గ్రామాల రోడ్లు ఎక్కువ నిర్మించడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే పటేల్ మాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 14 గ్రామాలకు సౌకర్యార్థం కేంద్రం ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకువచ్చామని తెలిపారు. దశల వారిగా కేంద్ర నిధులతో రోడ్లను అభివృద్ధి పరుస్తామన్నారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణ్ రెడ్డి, మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు రాజేష్ బాబు, నర్సాగౌడ్, సాంప్లీ రమేష్, సతీష్ రెడ్డి, తాటివార్ రమేష్, ధర్మపురి సుదర్శన్, శ్రీనివాస్, భూమెష్, సప్పటోల్ల పోతన్న పాల్గొన్నారు.

ముస్లీముల పట్టణ బంద్ పాక్షికం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రవక్త మహ్మద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని ఖుర్షిద్ నగర్ మస్సీజిదే నూర్ మౌళన అబ్దుల్ ఆలీ అన్నారు. బుధవారం ముస్లీం మత పెద్దల పిలుపు మేరకు చేపట్టిన బంద్ పాక్షికమైంది. ఈ సందర్భంగా ముస్లీం సంఘాలు, మత పెద్దలు పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఎస్పీ గౌస్ ఆలం కూడా పరిస్థితిని మార్కెట్‌లో పర్యటించి పరిశీలించి పోలీసులకు సూచనలు చేశారు. ఇదిలా ఉంటే కొందరు బంద్‌లో స్వచ్చందంగా పాల్గొని దుకాణాలను మూసి ఉంచారు. ఈ సందర్భంగా మౌళన అబ్దుల్ అలీ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తు ముస్లీం మనోభావాలను దెబ్బ తీస్తున్నారని తెలిపారు. భారత దేశంలో అన్ని మతల వారు కలిసి మెలసి ఉంటున్నారన్నారు. కానీ శాంతియుత వాతావరణాన్ని కలుషితం చేసేల కొందరు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎవరి ధర్మం కూడా ఇతరుల ధర్మాన్ని, మనోభావాలను కించపరాచలని చెప్పాదన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా బంద్‌కు భీమ్ ఆర్మీ తరపున మద్దతు పలికారు. యూపీకు చెందిన నర్సింహానంద స్వామి మహ్మద్ ప్రవక్తపై అభద్రత వాక్యాలు చేసిన ఆయనకు కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ ఆజాద్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల్, భీమ్ ఆర్మీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాంపల్లి గోపి, షేక్ అజిమద్దిన్ షేక్ అస్లాం, కొలాం సంఘం అధ్యక్షుడు కడప సోనేరావు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణపై స్పష్టత ఎందుకు ఇవ్వడం లేదు..?

- ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



వతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టత ఎందుకు ఇవ్వడం లేదని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కూడల స్వామి ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయకుండా ఉద్యోగాల భర్తీ చేయడాన్ని నిరసిస్తూ ఆందోళనల చేపట్టారు. బుధవారం అంబేద్కర్ చౌక్ నుంచి నల్ల జెండాలను పట్టుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ఇక్కడ ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏండ్లుగా మందకృష్ణ మాదిగ నేతృత్వంలో అనేక అవమానాలు భరించి వర్గీకరణ కోసం ఉద్యమించామన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీం వర్గీకరణ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించిందన్నారు. అధికారంలోకి రాకముందు వర్గీకరణను సమర్ధించిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఉప కులాలకు వర్గీకరణ చేయకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తు భర్తీ చేస్తున్నారన్నారు. ఇది తామను మోసం చేయడమేనని అన్నారు. వెంటనే వర్గీకరణ చేపట్టాలని లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కంబ్లె బాలాజీ మాదిగ, బెడ బుడగ జంగాల జిల్లా అధ్యక్షులు పసుల రాజు, మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చందల రాజన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి నవీన్ మాదిగ, ఉపాధ్యక్షులు బరకుంట సుభాష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రీకాంత్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి సీనియర్ నాయకులు దుబ్బాక సుభాష్ మాదిగ ఉన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి



నవతెలంగాణ- ఖానాపూర్

గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శులు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచాలని డీపీఓ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని సత్తనపల్లి రైతు వేదికలో నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచయతీకి వచ్చే ఆదాయం, ఇంటి పన్ను వసూలు అప్పటికప్పుడు రికార్డు చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా పరిసరాల పరిశుభ్రత , డ్రైనేజీలు, సానిటేషన్, విద్యుత్ దీపాలు నిర్వాహణ సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌పీఓ, మండల పంచాయతీ అధికారి చిట్యాల రత్నాకర్ రావు, ఖానాపూర్, పెంబి, కడెం, దస్తూరాబాద్ మండలాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

నవతెలంగాణ-నిర్మల్ టౌన్



పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 1 నుండి పారిశుధ్య కార్మికులు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సమ్మె చేపట్టినట్లు తెలిపారు. వారి వేతనాలు చెల్లించేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. నిర్మల్ మున్సిపాలిటీలో ఇంటి పన్ను బకాయిలు వసూలు చేస్తున్నామని, కార్మికులకు వేతనాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దసరా పండుగన పురస్కరించుకుని కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు

నవతెలంగాణ-నిర్మల్

సీసీఐ వారి ద్వారా పత్తి కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మార్కెటింగ్ శాఖ ఏడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి పంట అమ్మకానికి వచ్చే రైతులు తమ బ్యాంకు ఖాతాలు పనిచేస్తున్నాయో లేదో చూసుకోవాలన్నారు. రైతుల ఆధార్ కార్డుకు వారివారి మొబైల్ నెంబరు అనుసందం చేసి ఉండాలన్నారు. రైతులు తమ పంటను అమ్మేందుకు వచ్చేటప్పుడు తమ వెంట మొబైల్ ఫోనుతో పాటు రెండు కాపీల పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డ్, రైతు కౌలుదారుడు అయితే వ్యవసాయాధికారి జారీ చేసిన పంట ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. కచ్చితంగా రైతులు లేదా వారి రక్తసంబంధికులు మాత్రమే పంట అమ్మకానికి తీసుకురావాలని తెలిపారు.

ప్రశాంతంగా నిమజ్జనోత్సవాలను నిర్వహించాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

ఈ నెల 11న దుర్గ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ భీమేష్ తెలిపారు. బుధవారం పోలీసు స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భీమేష్ మాట్లాడుతూ నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. డీజే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యూవకులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సభ్యత్వాలు పెంచాలి



నవతెలంగాణ-ముధోల్

నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వం నమోదును పెంచాలని ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ అన్నారు. బుధవారం సభ్యత్వ నమోదు కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకునే విధంగా చూడాలన్నారు. సభ్యత నమోదు కార్యక్రమాన్ని గడువులోగా ముగించాలన్నారు. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీకి ప్రజల నుండి అపూర్వ ఆదరణ ఉందన్నారు. సభ్యత్వాలను ముమ్మరంగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణ్ రెడ్డి, సభ్యత్వం నమోదు జిల్లా కోఆర్డినేటర్ సుస్మిత రెడ్డి, మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు రాజేష్ బాబు, నర్సాగౌడ్, సాంప్లీ రమేష్, భూమేష్, సతీష్ రెడ్డి తాటివార్ రమేష్, సుదర్శన్, శ్రీనివాస్, సప్పటోల్ల పోతన్న, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భైంసా : సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా వ్యవరించి నియోజకవర్గంలో సభ్యత్వాలు పెంచినందుకు జిల్లా సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ సిరం సుష్మారెడ్డిని ఎంపీ గోడం నగేష్, ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ సత్కరించి అభినందనలు తెలిపారు. ముధోల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం ఆమెను సన్మానించి నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇందులో మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పరెడ్డి పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని హస్నాపూర్ గ్రామంలో బుధవారం ఇంటింటా బీజేపీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రితేష్ రాథోడ్ నాయకత్వంలో ప్రతి ఒక్కరు బీజేపీ సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అమర్ నాథ్, రవి, మహిళలు ఉన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-ఉట్నూర్

హర్యానా ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించటంతో బుధవారం మండలంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర యువ నాయకులు రాథోడ్ రితేష్ మాట్లాడుతూ హర్యానాలో ఘన విజయం సాధించిందన్నారు. రాబోయే రోజులలో రాష్ట్రంలో వచ్చేది బీజేపీయేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేష్, యువ మోర్చా జిల్లా కార్యదర్శి బొడ్డు కిరణ్, తన్నీరు, సతీష్, కూటికల ఆశన్న, లింగాగౌడ్, శేషారావు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | అక్టోబర్ 10, 2024 | www.navatelangana.com

చేగువెరా గొప్ప విప్లవకారుడు

నవతెలంగాణ-కెరమెరి



చేగువెరా గొప్ప విప్లవకారుడని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు చటారే భీంరావు అన్నారు. మంగళవారం మండలంలోని నీంగూడ గ్రామంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు చటారే భీంరావు మాట్లాడుతూ అర్జెంటినా మార్క్సిస్ట్ విప్లవకారుడు, వైద్యుడు, రచయిత, మేధావి, గెరిల్లా నాయకుడని పేర్కొన్నారు. విద్యార్థులు ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చటారే రాజేందర్, శేఖర్, శ్రీరామ్, దినేష్, హాస్టల్ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం బెజ్జూరు జిల్లా పరిషత్ 2010-11 పదవ తరగతి బ్యాచ్ మాజీ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక చోట చేసి సందడి చేశారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం ఏ రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. అనంతరం సెల్ఫీలు దిగుతూ ప్రతి ఏటా సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా రవీందర్‌సింగ్‌ని గెలిపించాలి

- శాతవాహన జేఏసీ చైర్మన్ చెన్నమల్ల చైతన్య



నవతెలంగాణ-కెరమెరి

కుమురం భీం ఆశయా సాధనకు పాటు పడే వ్యక్తిగా పట్టభద్రుల ఎన్నికల్లో శాతవాహన సర్దార్ రవీందర్ సింగ్‌ను గెలిపించాలని శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ చెన్న మల్ల చైతన్య అన్నారు. మంగళవారం ఆదివాసుల ఆరాధ్యదైవం కుమురం భీం అసువులు బాసిన పొరుగడ్డ జోడేఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా భీం నిలువెత్తు విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా పట్టభద్రులందరూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులు సర్దార్ రవీందర్ సింగ్‌ని ఎమ్మెల్సీగా గెలించేందుకు కృషి చేయాలన్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎన్నిక కోసం డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థి, నిరుద్యోగుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న వ్యక్తులను ఎన్నుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. నవంబర్ 6 వరకు అర్హులైన గ్రాడ్యుయేట్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్లు ఫారం-18లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గతంలో ఓటు హక్కు కలిగి ఉన్నవాళ్లు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూరారం యాదవ్, నైతం మహేష్, బోడకుంట రమేష్, కన్నం గణేష్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామ శివారులో బుధవారం పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై రాజు తెలిపారు. అక్కడ పేకాట ఆడుతున్న ఉండిరివాడే మనోజ్, జిమ్మిడి వెంకటి, నెట్టూరి అంజయ్యలతో పాటు మరి కొంతమందిని పట్టుకున్నామని తెలిపారు. వారి వద్ద నుండి రూ. 400నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై కందూరి రాజు పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-దహెగాం

కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను చిన్న ఐనం గ్రామస్తులు సత్కరించారు. మండలంలోని చిన్న ఐనం గ్రామ వ్యవసాయశాఖ గిడ్డంగి ప్రహరిగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించి గిడ్డంగి నిర్వహణకు తగు సూచనలు చేసిన కాగజనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి ధన్యవాదలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శ్రీరామారావు, మాజీ ఎంపీపీ కంభగోని సులోచన, సంతోష్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గందె వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చెమ్మగారి తోగేష్, ఎస్కే సమీర్, రాజారాం, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్త సహకారంతోనే ఎస్జీటీ ఉద్యోగం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని తక్కలపల్లి గ్రామానికి చెందిన నంది మంజుల ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 62వ ర్యాంక్ సాధించి ఎస్జీటీ ఉద్యోగానికి అర్హత సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన మంజుల చిన్నప్పటి నుండి చదువుపై ఆసక్తితో పేదరికానికి ఎదురొడ్డి సంకల్ప దీక్షతో ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. భర్త వెంకటేష్ సహకారంతోనే ఈ ఉద్యోగం సాధించగలిగానని తెలిపారు. కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు సంతోష వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించినంతరం కలెక్టరేట్ ఏఓ మధుకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అనేది మాదిగలు ఎప్పటినుండో కంటున్న కళ అన్నారు. దానిని నిజం చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్‌లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉద్యోగ నోటిఫికేషన్, భర్తీ ప్రక్రియ కొనసాగుతుందని వీటన్నింటిని వర్గీకరణ పూర్తి చేసిన తర్వాత భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భాస్కర్, యశోద, రాజేష్, మహేష్, రమేష్, వినేష్ ప్రసాద్, సాగర్, శేఖర్, బేడ బుడగ జంగాల రాష్ట్ర నాయకులు పస్తం అంజయ్య పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024-25 సీజన్ కొనుగోలుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి కాటన్ కార్పొరేషన్, వ్యవసాయ, మార్కెటింగ్, విద్యుత్, అగ్నిమాపక, రవాణా, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పత్తి కొనుగోలుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో 3 లక్షల 30 వేల ఎకరాలలో రైతులు పత్తి సాగు చేశారని, 23 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో 17 జిన్నింగ్ మిల్లులలో కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వం పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 నిర్ణయించడం జరిగిందని తెలిపారు. అగ్నిమాపక, విద్యుత్, తూనికలు కొలతల శాఖల అధికారులు జిన్నింగ్ మిల్లులను సందర్శించి సౌకర్యాలు, ఏర్పాట్లపై నివేదిక అందించాలని ఆదేశించారు. జిన్నింగ్ మిల్లు యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రక్షణ చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మిల్లులలో పత్తి నిలువ పేరుకుపోకుండా చూడాలని, రహదారులకు ఆనుకొని మిల్లులు ఉన్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, పత్తి మిల్లుల్లో పనిచేసే కార్మికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి విక్రయించేందుకు కేంద్రాలకు వచ్చే రైతులకు తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని, కొనుగోలు ప్రక్రియ పూర్తైన 3 రోజులలోగా ఆన్‌లైన్ ద్వారా సంబంధిత రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు పత్తి తేమ, నిబంధనలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించాలన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నవంబర్ మొదటి వారంలో పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన పూర్తి స్థాయి చర్యలతో సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి అష్మద్, పత్తి కొనుగోలు కేంద్రాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, జిన్నింగ్ యజమానులు పాల్గొన్నారు.

వరిని ఆశిస్తున్న ఎండు తెగులు



- నష్టపోతున్న రైతులు

నవతెలంగాణ-బెజ్జూర్

పంట పొట్టకు వచ్చిన దశలో ఆరు కాలం కష్టపడి పండించిన వరి పంట ఎండు తెగుళ్ల ఆశించటం రైతులకు నష్టాన్ని మిగులుస్తుంది. మండలంలో గ్రామాల్లోని వరి పంటను ఎండు తెగులు ఆశించి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. పంట పొట్టకు వచ్చిన సమయంలో వరి నారు ఎండిపోయి కనిపిస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని మందులు పిచికారి చేసిన ఎండు తెగుళ్ల నుండి కాపాడుకోలేక కనీసం పంట పెట్టుబడి అన్న వస్తుందో లేదో అని లబోదిబో అంటున్నారు. ఎండు తెగులు ఆశించి వందల ఎకరాల్లో వరి పొలం ఎండిపోతుంది. ఇటు ఒకపక్క వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు మరోపక్క వరి పొలాలకు ఎండు తెగులు ఆశించి తీవ్ర నష్టాన్ని మిగులుస్తుంది. దీనిపైన రైతులకు సరైన అవగాహన లేక కష్టాలు పడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి ఎండు తెగులు ఆశించిన వరి పొలాలను సందర్శించి రైతులకు సూచనలు అందించాలని కోరుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించాలని విన్నవిస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మీనా, ఏఈఓ, బెజ్జూర్



బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించకుండా రైతులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. ఎండు తెగులు ఎక్కువ దుబ్బ చేసే దశ నుండి చిరు పొట్ట దశలో అధికంగా ఆశిస్తుంది. ఎండు ఆకు తెగులు ఆశించినప్పుడు ఆకులు కొనాలనుంచి అంచుల వెంబడి ఎండిపోతుంది. వాతావరణంలో గాలి అధిక తేమ వలన నత్రజని ఎరువులు ఎక్కువ మోతాదులో వాడితే ఈ తెగుళ్ల ఉధృతి ఎక్కువ ఉంటుంది. వీటి నివారణకు ఎంఓపీ పొటాష్ 25 కిలోలు ఎకరాకి వేయాలి. రాగి ధాతు సిలింద్ర నాశనికి రెండు గ్రాముల హైడ్రాక్స్ సైక్లోఫిన్ ప్లాంట్ మాస్ ఇన్ 0.4 గ్రాములు లేదా అగ్రిమెంట్స్ 0.4 గ్రాములు మిశ్రమాన్ని ఒక లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేస్తే బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు నుండి కాపాడుకోవచ్చు.

ఎల్ఆర్ఎస్ సర్వే వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్-2020 పథకంలో అనుమతి లేని లే-అవుట్ల క్రమబద్ధీకరణకు అందిన దరఖాస్తులను రికార్డులు సరి చూసి క్షేత్రస్థాయిలో సదరు ప్లాట్ల భౌగోళిక స్థితిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్‌కు 7698 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. నిషేధిత, ప్రభుత్వ భూములు, చెరువు శిఖం, వాగుల సంబంధిత భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది క్షేతస్థాయి పరిశీలనకు వెళ్ళినప్పుడు దరఖాస్తుదారుడికి సమాచారం అందించి దరఖాస్తు సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించాలని సూచించారు. సర్వే ప్రక్రియను త్వరగా పూర్తిచేసి తదుపరి కార్యచరణకు రికార్డు సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

- ఉద్యమకారుల పాదయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండ్రా రాజేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాదయాత్రకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు దాటిన ఉద్యమకారులకు గుర్తింపు లేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి అమరులైన కుటుంబాలకు తగిన గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యమకారులందరం పాదయాత్రలను ప్రారంభించనునట్లు తెలిపారు. దీనికిగాను తెలంగాణ ఉద్యమకారులు పార్టీలకు అతీతంగా మమేకమై ఈ పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉద్యమకారులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని, రానున్న లోకల్ ఎన్నికల్లో ఉద్యమకారులకు ప్రత్యేక స్థానం కల్పించాలని, ఉద్యమకారులకు ప్రతి జిల్లాలో సంక్షేమ భవనం నిర్మించాలని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన 1250 మంది అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం సాయం చేయాలని, గుర్తింపు కార్డు ఇవ్వాలని, హెల్త్ కార్డ్స్, ఫ్రీ బస్సు, పెన్షన్ వెంటనే కల్పించాలన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ దర్ము, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోయిన్, నాయకులు రవీందర్, లక్ష్మణ్, వసంతరావు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీ నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా



నవతెలంగాణ-కౌటాల

వివిధ ధ్రువపత్రాలకు చేసుకున్న దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి నిర్ణీత గడువులోగా ధ్రువపత్రాలను జారీ చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. బుధవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిస్టర్లు, భవనం పరిసరాలను పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల ధ్రువపత్రాలకు అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి నిబంధనల ప్రకారం జారీ చేయాలన్నారు. ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులను రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల సమన్వయంతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల జిల్లా కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బెజ్జూర్

పంచాయతీ కార్యదర్శుల జిల్లా కార్యవర్గం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి సంధ అశోక్ తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా మహమ్మద్ మిన హాజ్ అలీ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నేరెళ్ల రాజేశ్వర్, వైస్ ప్రెసిడెంట్లుగా సంగోజ్ రవీందర్, దర్శనాల పద్మ, సెక్రెటరీగా ప్యాగ పోషం, సంయుక్త కార్యదర్శులుగా సుబ్బా సాయికృష్ణ, బెజ్జంకి ప్రియాంక, కోశాధికారిగా వంశీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బోట్ల శ్వేతా రాణి, ప్రచర కార్యదర్శిగా జి.ప్రేమలత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కంది కిరణ్ కుమార్, ఆకుల శ్వేత ఎన్నికైనట్లు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు మహమ్మద్ మినహాజ్ అలీ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై స్పందిస్తూ పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హైదరాబాద్ బయలుదేరిన ఉపాధ్యాయ అభ్యర్థులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఎంపికై రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అపాయింట్మెంట్ ఆర్డర్స్ తీసుకోవడంలో భాగంగా జిల్లా కేంద్రం నుండి డీఎస్సీ ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం 3 గంటలకు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుండి బయలుదేరి వెళ్లారు. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీ, లాంగ్వేజ్ పండిత్ కేటగిరీలలో మొత్తం 341 పోస్టులు ఖాళీగా ఉండగా వివిధ కారణాల నేపథ్యంలో 314 మందిని ఎంపిక చేశారు. వీరిని హైదరాబాద్ తరలించడానికి కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా విద్యాధికారి యాదయ్య ఆధ్వర్యంలో ఏడు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఎంపికైన వారికి ఫోన్ ద్వారా సమాచారం తెలిపిన అధికారులు వారిని మంగళవారం రాత్రి వరకు జిల్లా కేంద్రానికి వచ్చేలా ఏర్పాటు చేశారు. ప్రతి బస్సుకు నలుగురు చొప్పున ప్రత్యేక అధికారులను పర్యవేక్షణ కోసం నియమించారు. వీరిలో ఒకరు ఎంఈఓ, మరొకరు స్కూల్ అసిస్టెంట్‌తో పాటు పోలీస్ కానిస్టేబుల్, హెల్త్ డిపార్ట్మెంట్ వ్యక్తి ఉన్నారు.

టీకాలపై అవగాహన



నవతెలంగాణ-వాంకిడి

వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా బుధవారం బెండార గ్రామంలోని ఉప కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, పిల్లలకు టీకాలు సరిగా వేయించాలని, వాటి ద్వారా పిల్లలకు, తల్లులకు ముందస్తుచర్యగా అనారోగ్య సమస్యలు రాకుండా వ్యాధుల నుండి కాపాడుతాయన్నారు. పిల్లలకు తప్పని సరిగా టీకాలు వేయించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి రవిదాస్, ఎంఎల్‌హెచ్‌పీ సుచిత్ర, ఏఎన్ఎం వసంత పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న ఆర్డీఓ



నవతెలంగాణ-తాండూర్

జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం బెల్లంపల్లి కాంట చౌరస్తా వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కెల్లా అన్నదానం గొప్పదని, ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చడం గొప్ప విషయమని తెలిపారు. ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న జనహిత సేవా సమితి సభ్యులని అభినందించారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్, కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల రమాదేవి, గౌరవ సలహాదారులు కొట్టే రమేష్, పూదరి నగేష్‌గౌడ్, నిచ్చకోల గురుస్వామి పాల్గొన్నారు.

నూతన ఆర్డీఓ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో నూతన ఆర్డీఓ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో మంచిర్యాల ఆర్డీఓ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి వి.రాములు, ఏసీపీ ప్రకాష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ప్రజలకు మరింత సౌకర్యవంతంగా అన్ని ఏర్పాట్లతో నూతన ఆర్డీఓ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు.

టేకు కలపతో అక్రమంగా మంచాల తయారీ



నవతెలంగాణ-జన్నారం

జన్నారం మండలం లోని అల్లినగర్ గ్రామంలో టేకు కలపతో అక్రమంగా మంచాలు తయారు చేసి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం అటవీశాఖ అధికారులు ఆ గ్రామానికి వెళ్లి పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని అల్లి నగర్ గ్రామానికి చెందిన ఆత్రం నగేష్ అనే వ్యక్తి ఇంట్లో విలువైన టేకు కలపతో మంచాలు తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు వెళ్లి సోదాలు చేసి పట్టుకున్నామన్నారు. పట్టుకున్న మంచాలను జన్నారం అటవీ రేంజ్‌కు తరలించినట్లు తెలిపారు. వాటి విలువ రూ.54 వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ తిరుపతి, ఎఫ్ఎస్ఓలు శివకుమార్, మధుకర్ కిరణ్ మహి ఎఫ్‌బీఓలు పరమేశ్వర్ తన్‌వీర్‌భాషా పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం సద్దుల బతుకమ్మ సందర్భంగా, ఆయా గ్రామాల కార్యదర్శులు బుధవారం ఏర్పాట్లను పూర్తి చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మకు సంబంధించిన పనులను ఆయా గ్రామాల కార్యదర్శులు అధికారులు పనులను పూర్తి చేశారు. మండలంలోని రేండ్లగూడ గ్రామంలో కార్యదర్శి లకావత్ శ్రీనివాస్ పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ ఈఓ రాహుల్ ఆ గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ బతుకమ్మ సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

బీజేపీ సభ్యత్వ నమోదు పెంచి రాబోయే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి తెలిపారు. బుధవారం పట్టణంలోని అంగడి బజార్‌లో స్థానిక నాయకులతో కలిసి బీజేపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని షాపులలో అందరికీ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడికి వెళ్ళినా మహిళలు, రైతులు, కార్మికులు, యువకులు పెద్ద ఎత్తున సభ్యత్వం తీసుకోవడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరు బీజేపీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వీరమళ్ళ హరి గోపాల్‌రావు, పట్టణ ఇన్‌చార్జి మోట పలుకుల తిరుపతి, రమేష్ జైన్, గుండా ప్రభాకర్, బుద్ధి లక్ష్మణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సామ వెంకటరమణ, సాయి సచిన్, మోట పలుకుల సతీష్, ఉపాధ్యక్షులు ఎంబడి వెంకటేష్, ఎంబడి శ్రీనివాస, కోమాకుల రవి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఎస్ఏ ఉద్యోగం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలం సూరారం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్.వెనతి ఉద్యోగం చేస్తూనే మొదటి ప్రయత్నంలోనే డీఎస్సీలో జిల్లాస్థాయిలో ర్యాంక్ సాధించి స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ ఉద్యోగాన్ని సాధించారు. నిరంతర కృషి, పట్టుదలతోనే విజయం సాధించానని తెలిపారు. ఉద్యోగం సాధించడంలో భర్త ప్రోత్సాహం, తల్లిదండ్రుల కృషి ఎంతో ఉందని తెలిపారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సరిత, మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొనికేనీ దయానంద్, పెంబి మండల అధ్యక్షుడు సప్పిలరెడ్డి, ఎంపీఓ రత్నాకర్‌రావు, సూపర్‌వైజర్ శ్రీలత, నాయకులు లక్ష్మీపతిగౌడ్, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీకి మద్దతిస్తాం

నవతెలంగాణ-నిర్మల్

మండలంలోని దిలావర్‌పూర్ గుండంపల్లి గ్రామాల పంట భూముల్లో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులు తమ పూర్తి మద్దతు ఉంటుందని బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి, నాయకులు యు సుభాష్ తెలిపారు. బుధవారం ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ చేపట్టిన ఆందోళనకు వారు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ రెండు గ్రామాలకు సంబంధించిన పంట భూముల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీ నిర్మిస్తే భవిష్యత్తులో పారిశ్రామిక ప్రాంతంగా మారి మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలు స్థాపించడానికి గ్రామ ప్రజలు, రైతుల నుంచి ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకపోవడం శోచనీయమని అన్నారు. ప్రతీ ఫ్యాక్టరీ నుంచి కాలుష్యం వస్తుందని కాలుష్యంలో వ్యవసాయం చేసే పల్లెలు కొట్టుమిట్టాడేలా ఫ్యాక్టరీ స్థాపించడం సరైన పద్ధతి కాదని తెలిపారు. బీఆర్ఎస్ ఎల్లవేళలా ప్రజల తరఫున పోరాడడానికి సిద్ధంగా ఉంటుందని, ఉద్యమాన్ని ఉధృతం చేసి పోరాడాలన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

నవతెలంగాణ-జన్నారం

వరి పంట సాగులో రైతులు యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని మండలంలోని పోన్కల్ క్లస్టర్ ఏఈఓ త్రిసంధ్య సూచించారు. బుధవారం ఆక్లస్టర్ పరిధిలోని పలువురు రైతుల పొలాలను సందర్శించి వరి పంటను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంట ఎదుగుదశలో ఉందని, గడ్డి పెరగకుండా సస్య రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తెగుళ్ల సోకితే అధికారుల సూచనల మేరకు పురుగు నివారణ మందులు వాడాలని రైతులకు సూచించారు.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

పత్తి కొనుగోళ్లకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వి.రాములు, హరికృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ షాబొద్దీన్‌లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం పత్తి మద్దతు ధర క్వింటాల్కు రూ.7 వేల 521 ధర నిర్ణయించడం జరిగిందని, దళారులను నమ్మి మోసపోకుండా రైతులు కొనుగోలు కేంద్రాలలో పత్తిని విక్రయించి లబ్ది పొందాలని తెలిపారు. అగ్నిమాపక, విద్యుత్, తూనికలు కొలతల శాఖల అధికారులు జిన్నింగ్ మిల్లులను సందర్శించి సౌకర్యాల ఏర్పాట్లపై నివేదిక అందించాలని ఆదేశించారు. జిన్నింగ్ మిల్లు యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రక్షణ చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మిల్లులలో పత్తి నిలువ పేరుకుపోకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, పత్తి మిల్లులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు.



వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యాపరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం శ్యాముల్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో తెలంగాణ విద్యాపరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యారంగంలో వస్తున్న మార్పుల గమ్యం ఎటువైపు అనేదానిపై చర్చించారు. ఈ సందర్భంగా శ్యాముల్ మాట్లాడుతూ విద్యారంగంలో కార్పొరేటీకరణను ప్రోత్సహించే జాతీయ విద్యావిధానం ఎన్ఈపీ 2020ని తిరస్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్లో 20 శాతం నిధులు కేటాయించాలన్నారు. ఒకటో నుంచి మూడో తరగతులకు అంగన్‌వాడీలో కలిపే ఆలోచన విరమించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉన్నత పాఠశాలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చి అన్ని వసతులు కల్పించాలని, పాఠశాల, కళాశాల స్థాయిలో విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన బోధ నేతల ఖాళీలు భర్తీ చేయాలన్నారు. కామన్ స్కూల్ విద్యావిధానాన్ని అమలు చేయాలని, నియోజవర్గంలో ఇంటర్నేషనల్ ఈ స్కూల్ ప్రతిపాదన వెంటనే ఉప సమరించుకోవాలన్నారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, వృకోదర్, సాయినాథ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేష్, టీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, ఏఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, స్టూడెంట్స్ జేఏసీ కన్వీనర్ రాహుల్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు తబ్రేజ్ ఖాన్, డీటీఎఫ్ నాయకులు సుధాకర్, నాగేందర్, దిలీప్, రాకేష్, అక్షయ్, దత్తు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల పనితీరుపై అవగాహన

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి 2టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కాల్ టెక్స్ ఏరియాలోని స్థానికులకు, దుకాన యజమానులకు బెల్లంపల్లి రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలుద్దీన్, బెల్లంపల్లి 2టౌన్ ఎస్ఐ మహేందర్ సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యక్త గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం నేరలా అదుపులో ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. సంఘ విద్రోహ శక్తుల కదలికలను పసి గట్టడంలో నిఘా నేత్రాలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీస్‌లతో సమానని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తు తించి ప్రజలు వ్యాపారస్తులు తమ తమ కాలనీ లోషాప్‌ల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



నేడు సద్దుల బతుకమ్మ

- మార్కెట్‌లో పూల సందడి



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల మార్కెట్ బుధవారం బతుకమ్మ సందడి నెలకొంది. పెద్ద ఎత్తున రకరకాల పూలు విక్రయించడంతో మహిళలు భారీగా మార్కెట్‌కు తరలివచ్చారు. బతుకమ్మను పేర్చేందుకు మహిళలు తీరొక్క పూలు కొనుగోలు చేశారు. గురువారం సద్దుల బతుకమ్మ ఉండడంతో పెద్ద ఎత్తున పట్టణ వాసులు మార్కెట్‌కు తరలి వచ్చారు . బతుకమ్మ అలంకరణ కోసం తంగేడు, గునుగు, బంతి పూలను కొనుగోలు చేశారు. చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుండి రైతులు పూలను తీసుకొచ్చి మంచిర్యాల మార్కెట్‌లో విక్రయించారు. మార్కెట్‌తో పాటు పలు రహదారులు పూలు అమ్మే వారితో నిండి పోయాయి. పూల ధరలు కాస్త స్థిరంగానే ఉన్నాయని వినియోగ దారులు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి వినియోగ దారులు మార్కెట్‌కు తరలి రావడంతో మార్కెట్ అంత రద్దీగా మారింది, పెద్ద ఎత్తున వాహనాలు రోడ్డుపై నిలపడంతో రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



డీఎస్సీ బాధితులతో టీయూటీఎఫ్ కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

డీఎస్సీ జాబితాలో అవకతవకలు జరిగాయని బాధిత అభ్యర్థులకు న్యాయం చేయాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి కోరారు. ఈ విషయమై బుధవారం కలెక్టర్ రాజర్షి షాను బాధితులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్జిటీ తెలుగు మీడియం విభాగంలో 12వ ర్యాంకు సాధించిన అభ్యర్థికి అసలు పోస్ట్ కేటాయించలేదన్నారు. అలాగే స్పోర్ట్ కోటలో అర్హత గల అభ్యర్థికి కాకుండా అనర్హత గల అభ్యర్థికి పోస్ట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మరాఠీ మీడియం ఎస్జీటీ పోస్టుల్లో 34 ర్యాంక్ అభ్యర్థికి చెందాల్సిన ఉద్యోగాన్ని 51వ ర్యాంకు అభ్యర్థికి కేటాయించారన్నారు. సౌజన్య అనే అభ్యర్థి ఎస్జీటీ పోస్ట్‌లో పని చేస్తానని ఆప్షన్ ఫామ్ ఇచ్చిన తర్వాత కూడా ఆమెకు ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ కేటాయించారని తెలిపారు. ఎస్ఏ ఫిజికల్ సైన్స్ విభాగంలో జనరల్ అభ్యర్థికి కేటాయించవలసిన ఉద్యోగాన్ని రిజర్వేషన్ అభ్యర్థి కేటాయించడంపై ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

నవతెలంగాణ-బోథ్



మండలములోని నిగ్ని గ్రామసమీపంలోని మహారాష్ట్ర సరిహద్దుల్లో గల ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ శిఖర్ కైలాష్ టెక్డిలోని శివాలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనీల్ జాదవ్ బుధవారం దర్శించుకున్నారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆలయంలోని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి పూర్తిగా సహకరిస్తానని అన్నారు. శ్రీ శిఖర్ కైలాష్ టెక్డి కొరకు రూ.12 కోట్లతో రోడ్డు పనులు చేపట్టబోతున్నామని ఫారెస్ట్ ఆమోదానికి సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. వీలైనంత త్వరలోనే శిఖర్ కైలాష్ టెక్డిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, స్వామి, ప్రవీణ్, ఎలక రాజు, సోమన్న ప్రితంరెడ్డి, చిన్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో జిరాక్స్ షాపు కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి సీజన్‌లో రైతుల సౌకర్యార్థం జిరాక్స్ సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు జిల్లా మార్కెటింగ్ అధికారి గజనంద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుసుము రూ.300 చెల్లించి దరఖాస్తు పొందలన్నారు. అదే రోజున సాయత్రం 4 గంటలకు అడిషనల్ కలెక్టరు ఆధ్వర్యంలో జిరాక్స్ పేజీలకు రేట్లు నిర్ధారణ చేస్తారని పేర్కొన్నారు.

పీఎం యశస్వీ పథకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

ప్రధానమంత్రి యశస్వి పథకం క్రింద ఉపకార వేతనాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు 9వ తరగతి నుండి 11వ తరగతి చదువుతున్న వారై ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించి ఉండరాదని తెలిపారు. బీసీ, ఈబీసీ, డీఎన్‌టీ విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో వైఈటీ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వినియోగంలో ఉన్న మొబైల్ నెంబర్, మొబైల్ లింక్ చేయబడిన ఆధార్ నంబర్, ఎన్‌పీసీఐ సీడింగ్ స్టేటస్ ఉండాలని, ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నర్వాయిపేటలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం

నవతెలంగాణ-తాండూర్



నెన్నెల మండలంలోని నర్వాయిపేట గ్రామంలో బుధవారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. డాక్యుమెంట్స్, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై జరిమానా విధించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి రూరల్ సీఐ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గాంజాయ్ సేవించడం, రవాణా చేయడం, పండించడం నేరమని తెలిపారు. గంజాయి నిందితులు పట్టుపడితే జైలు శిక్ష అనుభవించవలసి వస్తుందన్నారు. యువత గాంజాయ్ బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపపారు. కార్యక్రమంలో నెన్నెల ఎస్ఐ ప్రసాద్, తాళ్ల గురజాల ఎస్ఐ రమేష్, బెల్లంపల్లి టు టౌన్ ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

దుర్గామాత ఆశీస్సులు ఉద్యోగులందరిపై ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్

దుర్గామాత ఆశీస్సులు ఉద్యోగులందరిపై ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్పీ, ఆర్కె-5, 7, గనులలో దుర్గదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీఎం దంపతులు సంజీవరెడ్డి, రాధా కుమారి అమ్మవారి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులందరిపైన, సంస్థ పైన అమ్మవారి దయ ఉండాలని కోరారు. అలాగే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సంస్థ అభివృద్ధిలో పాల్పంచుకోవాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతకు ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపరితల గనుల ప్రాజెక్టు ఆఫీసర్లు శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఆర్కె-5 గని ఏజెంట్ శ్రీధర్ దంపతులు, ఆర్కె-6 గని మేనేజర్ తిరుపతి, ఆర్కె-5 గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్, డీజీఎం సీహెచ్పీ చంద్రలింగం, ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు పాల్గొన్నారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

నవతెలంగాణ-నస్పూర్

దసరా పండుగను అందరు సంతోషంగా జరుపుకోవాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి హమాలీలకు బోనస్ చెక్కులు, స్వీట్ బాక్సు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దసరా పండుగను ప్రజలందరు సంతోషంగా జరుపుకోవాలని, ఈ క్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ పరిధిలోని మంచిర్యాల, లక్షెట్టిపేట, చెన్నూర్, కోటపల్లి, బెల్లంపల్లి, తాండూర్‌లలోని గిడ్డంగులలో పని చేస్తున్న 44 మంది హమాలీలకు రూ.6 వేల 500 చెక్కు, స్వీట్ బాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 అధికారి మహిపాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న వ్యక్తుల అరెస్ట్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని గుళ్లకోట గ్రామ శివారులోని చిందం మునయ్య ఇంట్లో పేకాట రాయుళ్లను బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి సతీష్ తెలిపారు. పోలీస్ సిబ్బందితో రైడ్ చేసి ఎనిమిది మంది పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వారి వద్ద రూ. 3500 స్వాధీనం చేసుకున్నామన్నారు. చిందం మునయ్య, పెట్టం సురేష్, తిర్రి రవి, గంగాధరి లింగయ్య, బొరె బీమయ్య, మంగలపెళ్లి సత్తయ్య, లెక్కల రవి, మోటపలుకుల శ్రీనివాస్‌లు పట్టుబడినట్టు తెలిపారు.

నిర్మల్ ఏఎంసీ చైర్మన్‌గా సోమ భీంరెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సోమ భీమ్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నిర్మల్ రూరల్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సోమ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన ఈటెల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావుకి మార్కెట్ కమిటీ చైర్మెన్ కృతజ్ఞతలు తెలిపారు.

కుమురం సూరు వర్ధంతి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈనెల 17న జిల్లాలోని జోడేఘాట్‌లో నిర్వహించే కుమురం సూరు 27వ వర్ధంతి వేడుకలు విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో వర్ధంతి గోడ ప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసులల తరపున హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. ఆయన వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. దీనికి జిల్లాలోని ఆదివాసులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కుమురం సూరు ఉత్సవ కమిటీ చైర్మన్ మడవి రాజు, కన్వీనర్ మారుతి సభ్యులు ధర్ము, మాణిక్ రావు, రాజు, లక్ష్మణ్, గంగారాం పాల్గొన్నారు.

సమయానికి రారు.. రోగులకు పట్టించుకోరు..!

- ఇదీ పిట్టబొంగరం పీహెచ్‌సీ పరిస్థితి
- ఐటీడీఏ పీఓ సందర్శించినా మారని తీరు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీలలో కొన్ని చోట్ల వైద్యం సరిగా అందడం లేదు. మండలంలోని పిట్టబొంగరం పీహెచ్‌సీ ఆ కోవకే చెందుతుంది. మండలంలో మొత్తం 28 గ్రామ పంచాయతీలుండగా దాని పరిధిలో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. మారుమూల ప్రాంతంలో ఉన్న పిట్టబొంగరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే విమర్శలున్నాయి. గతంలో పీహెచ్‌సీని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తనిఖీ చేశారు. వైద్యాధికారితో పాటు ఇతర సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. బుధవారం పీహెచ్‌సీని నవతెలంగాణ సందర్శించగా వైద్యాధికారి రెండు రోజుల నుంచి హాజరు కావడం లేదని దృష్టికొచ్చింది. హెల్త్ సూపర్‌వైజర్, ఫార్మాసిస్ట్ సైతం విధుల్లో లేరు. ఈ విషయమై అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ కుడ్మెత మనోహర్‌ను నవతెలంగాణ వివరణ కోరగా విధులకు హాజరుకాని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది సమయపాలన, విధుల్లో నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాపా ప్రాణం కాపాడిన రిమ్స్ వైద్యుడు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్


డా. హేమంత్

ఓ పసిపాప ప్రాణం రిమ్స్ వైద్యులు కాపాడారు. గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన సత్యపాల్ ఏడు నెలల పసిపాప ధృతి అనుకోకుండా తన కాలుకు ఉన్న పట్ట గొలుసు నోట్లో పెట్టుకుని మింగింది. గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన రిమ్స్‌కు తీసుకువచ్చారు. అప్పటికే పాపకు శ్వాస ఆడక నీరసించిపోయింది. పాప పరిస్థితిని గమనించిన డ్యూటీ డాక్టర్లు అసోసియేట్ ప్రొఫెసర్, ఈఎన్‌టీ డా. మామిడి హేమంత్ రావుకు సమాచారం అందించారు. ఆయన వెంటనే వచ్చి పాపకు ఎండోస్కోపీ ద్వారా స్పెషల్ టెక్నిక్‌తో గొంతులో నుంచి పట్టగొలుసును బయటకు తీశారు. దీంతో కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. సాధారణంగా రెండు సంవత్సరాలపైన వయసున్న పిల్లలు గొంతు, ముక్కులో సుద్ద ముక్క, కాయిన్స్ లాంటివి పెట్టుకుంటారని, ఏడు నెలల పాప ఇలా గొంతులో పెట్టుకోవడం మొదటిసారి అన్నారు. దీంతో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ వైద్యుడిని అభినందించారు.

ఇన్‌చార్జి మంత్రి చొరవతో సమ్మె విరమణ



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

నిర్మల్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ తొమ్మిది రోజులుగా కార్మికులు సమ్మె చేపట్టారు. కలెక్టర్ అభిలాష అభినవ్ సెలవులో ఉండటంతో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సూచనతో పారిశుధ్య కార్మికులతో బుధవారం ఎస్పీ జానకి షర్మిల కలుసుకున్నారు. దీంతో మంత్రి సీతక్క ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు చేపడుతున్న సమ్మె విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి నెలరోజుల వేతనం చెల్లించేందుకు హామీ ఇచ్చారు. మిగతా పెండింగ్ వేతనాలు త్వరలోనే చెల్లిస్తామని వారికి భరోసా కల్పించారు. దీంతో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. వెంటనే స్పందించి మంత్రి సీతక్కతో మాట్లాడి వేతనాలు చెల్లించేందుకు కృషి చేసిన ఎస్పీకి పారిశుధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

నవతెలంగాణ-కుభీర్

వన్యప్రాణుల సంరక్షణపై డోడార్నా గ్రామస్తులకు బుధవారం అటవీ శాఖ సెక్షన్ అధికారి లక్ష్మణ్, బీట్ అధికారి రాజేష్ ఆధ్వర్యంలో అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను కాపాడుకోవాలని, వాటి ద్వారా ఎన్నో ఉపయోగాలుంటాయని తెలిపారు. అదే విధంగా గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం అక్కడి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, గ్రామస్తులు రంగారావు, ఇందల్, గోరక్‌నాథ్, ద్రమాజి ఉన్నారు.

దుర్గామాతా ఆలయంలో పూజలు

నవతెలంగాణ-రెబ్బెన

శరన్నవరాత్రులను పురస్కరించుకొని బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీలో దుర్గామాత ఆలయంలో జీఎం దంపతులు ఎం శ్రీనివాస్-ఉమా రాణి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. నిత్య పూజ, దుర్గా హవనం, కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యకర్యక్రమాన్ని జీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం రాజమల్లు, ఏజీఎం భీంరావు జాడే, ఎలక్ట్రికల్ ఈఈ రాజు, సీహెచ్‌పీ ఎలక్ట్రికల్ ఫోర్ మెన్ శ్రీనివాస్, సింగరేణి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించిన సర్వేలో ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం తన ఛాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంటింటి సర్వేలో సర్వే వివరాలు, ఫొటోగ్రఫీ, ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ, ఫ్యామిలీ ఫోటో అప్ లోడ్, తదితర వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ఫార్మట్‌లో పూరించిన ప్రకారం తప్పులు లేకుండా ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన ఏజెన్సీలలో ఆదిలాబాద్ రూరల్ లోహార, గుడిహత్నూర్ మండలంలో గోండు హర్కా పూర్, ఇచ్చోడ మండలంలోని అడేగాం(బి), మునిసిపాలిటీలో ఫ్యామిలీ డిజిటల్ కార్డ్‌ల జారీకి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన ఇంటింటి సర్వే గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ డేటా ఎంట్రీ తప్పులు లేకుండా గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఈడీఎం రవి, డీఎల్పీఓ ఉన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. బుధశారం మండలంలోని మారుమూల గ్రామాలైన మొరలిగూడ, కమ్మర్గావ్ గ్రామ పంచాయితీలలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. గత నెలలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, సబ్ కలెక్టర శ్రద్ధా శుక్లా సందర్శించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించగా పలు సమస్యలు వారి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం మండల అధికారులు అందరితో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం మండల అధికారులతో గ్రామస్తులకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశాల్లో భాగంగా మొరలిగూడ నుండి పెంచికల్‌పేట్ మండల కేంద్రం వరకు, బెజ్జూర్ మండల కేంద్రం వరకు రోడ్డు ఏర్పాటు చేయ్యాలని, సెల్ ఫోన్ టవర్ ఏర్పాటు గురించి, గిరివికాసం పథకం ద్వారా బోర్ వెల్స్ ఏర్పాటు గురించి, పోడు భూములకు లోన్స్ కావాలని, మిని హెల్త్ సెంటర్ కావాలని, అంతర్గత రోడ్లు, కల్వర్టులు కావాలని, రుణమాఫీ కావాలని, ప్రాణహిత బ్యాక్ వాటర్ ద్వారా జరిగిన పంట నష్టానికి పరిహారం కావాలని గ్రామస్తులు కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు మొరలిగూడ నుండి పెంచికల్‌పేట్ వరకు, గుండ్లపల్లి నుండి ఎటిగూడ వరకు మరమ్మత్తులు కోసం ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు తెలిపారు. కమర్గం గ్రామంలో రోడ్డు సౌకర్యం కావాలని, టవర్ ఏర్పాటు చేయ్యాలని, పెన్షన్స్ కావాలని, మంచి నీటి బోరుబావులు కావాలని, పోడు భూముల పట్టా కావాలని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాలని, చెరువుల మరమ్మత్తు చేయాలని, రేషన్ షాపు, అంగన్‌వాడీ భవన మరమ్మత్తులు చేయించాలని విన్నవించారు. గ్రామస్తుల నుంచి సేకరించిన విన్నపల ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అల్బర్ట్, తహసీల్దార్ వేంకటేశ్వర రావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనిల్ కుమార్, మిషన్ భగీరథ డీఈ పృథ్వీ, ఇరిగేషన్ డీఈ భద్రయ్య, పంచాయతీరాజ్ అధికారులు, ఏటీడీఓ, ఏపీ సతీష్, ఏపీఎం కోనయ్య, పశువైద్యాధికారి రాకేష్, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తాం



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనుల ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ఆదివాసీ పెద్దలు, వివిధ సంఘాల నాయకులు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ అనంతరం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో అన్ని శాఖల అధికారులతో ఆదివాసీ పెద్దలు, ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో సభను ఏర్పాటు చేశామన్నారు. ఐటీడీఏలను అభివృద్ధి పరచి ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారమయ్యేలా ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని, ఐటీఐ కళాశాలలను అప్‌గ్రేట్ చేసి ఆదివాసీ యువతకు మెరుగైన విద్యను అందిస్తామన్నారు. జైనూరు బాధితురాలికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రశాంతవంతమైన వాతావరణాన్ని నెలకొల్పడానికి ఆదివాసీ పెద్దలు కృషి చేయాలని, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కుమురం భీం మనువడు కుమురం సోనేరావ్, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, ఆదివాసీ పెద్దలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బతుకమ్మ పండుగ ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు బుధవారం సాయంత్రం మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారి భాస్కర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణులు పాల్గొని బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణకు సొంతమన్నారు. ఉద్యమంలో బతుకమ్మ పాటలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు. జిల్లాలోని మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలతో కలిసి కలెక్టర్ కాసేపు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా వ్యాప్తంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు జరిగాయి. దీనికి కలెక్టర్ రాజర్షి షా హాజరయ్యారు. ముందుగా గౌరమ్మకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి అందంగా తీర్చిదిద్దారు. అనంతరం బతుకమ్మ డీజే పాటలకు నృత్యాలు చేస్తూ అలరించారు. కలెక్టర్ సైతం బతుకమ్మ ఆడుతూ ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, డీడబ్ల్యూ సబిత, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



పల్లెల్లో దసరా సందడి

- కిక్కిరిసిన దుకాణాలు



నవతెలంగాణ-కెరమెరి

దసరా సందర్భంగా పల్లెలు కొత్త కళను సంతరించుకున్నాయి. ఊరూర బతుకమ్మ ఉత్సవాలతో సందడిగా మారాయి. మహిళలంతా భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబరాలను జరుపుకుంటున్నారు. మండలపరిధిలోని శివ్ మందిర్, బాలాజీ, హనుమాన్ ఆలయాల్లో దుర్గా దేవి విగ్రహాలను ప్రతిష్ఠించి రోజుకో అవతారంలో అమ్మవారికి అలంకరణలు చేసి పూజలు చేస్తున్నారు. ఊరూర బతుకమ్మ పేర్చి, పలు రకాల పుష్పాలతో బతుకమ్మలను అలంకరించి పాటలు పాడుతూ నృత్యాలను చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రతి ఏటాకంటే ఈ ఏడాది ప్రతి ఊరిలోనూ కూడళ్లలో ఏర్పాటు చేసిన ఉత్సవాల ప్రాంగణంలో బతుకమ్మలు ఆడుతున్నారు. ఆది, సోమవారాల్లో ఉత్సవాలను పూర్తి చేసి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చిరు వ్యాపారులకు పెరిగిన గిరాకీ

కొన్ని రోజులుగా దుర్గాదేవి నవరాత్రి, బతుకమ్మ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మహిళలు, యువతులు తమకు కావాల్సినవి కొనుగోలు చేయడానికి మండల కేంద్రానికి బారులు తీరారు. దీంతో మండల కేంద్రంలోని బట్టల దుకాణాలు, జనరల్ స్టోర్స్‌లలో సందడి నెలకొంది. వర్షాకాలం మొదలు నాలుగు నెలల పాటు ఎలాంటి గిరాకీ లేక ఇబ్బందులు పడ్డ చిరు వ్యాపారుల్లో ఆనందం వెల్లివిరిసింది.

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవి నవరాత్రుల్లో భాగంగా ఏడవ రోజు అమ్మవారు సరస్వతి అవతారంలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో అమ్మవారిని వివిధ అలంకరణలో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. పట్టణంలోని సాయినివాడలో వెలసిన శివ సాయి దుర్గ దేవి మండపం వద్ద అర్చకులు శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సరస్వతీ పూజలు నిర్వహించారు. అదే విధంగా మహిళలతో అష్టోత్తరాలు, కుంకుమార్చన, అభిషేకాలు చేపట్టారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు నిర్వహించిన మహా అన్నదాన వితరణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని రహపెల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాటరాయులను అరెస్టు చేశారు. పట్టణ సీఐ సతీష్ తెలిపిన వివరాలు ప్రకారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారం మేరకు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురికి గాను ఇద్దరు దొరికారని వారిని విచారించి, మిగతా ఐదుగురిని కూడా తీసుకోవచ్చి కేసు నమోదు చేసి వారి వద్ద నుండి రూ. పదివేల రెండు వందల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట స్థావరాలు ఎక్కడైనా కొనసాగితే సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాల్లో గ్రూపులుగా పాల్గొనండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం రామ్‌లీలా మైదానంలో సాయింత్రం 5:30గంటలకు బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో మహిళలు గ్రూపుల వారిగా పాల్గొనాలని ఉత్సవ సమితి సభ్యురాలు కత్తూర్‌వార్ మాలతీ తెలిపారు. బుధవారం పట్టణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బతుకమ్మలను చేసుకొని తాము ఎంపిక చేసుకున్న పాటలతో మంచి ప్రదర్శన చేసిన వారికి మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండవ బహుమతి రూ.5వేలు, మూడవ బహుమతి రూ.3వేలు ఇస్తామని తెలిపారు. ఇందులో అధిక సంఖ్యలో గ్రూపుల వారీగా మహిళలు పాల్గొని విజయవంతం చేయలని కోరారు. వివరాల కొరకు 9866072090, 9059484821 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో మహిళా సభ్యురాలు శశికళ చౌహన్, రేనికుంట రమ, ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, గౌరవ అధ్యక్షులు బండారి వామన్, ప్రధాన కార్యదర్శి గెడాం మాధవ్, కోశాధికారి పడకంటి సూర్యకాంత్, ముఖ్య సలహాదారులు కందుల రవీందర్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తాండూర్



ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా కస్తూరి శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.సిద్ధిక్, ఉపాధ్యక్షులుగా మిట్ట మల్లేష్, కోశాధికారిగా బంక వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులుగా కొండు మల్లేష్, అయిలి రాజేశం, ముఖ్య సలహాదారులుగా బీరెల్లి శ్రీనివాస్, ఎలుక తిరుపతి, గట్టు సంతోష్‌కుమార్, కొల్లూరి తిరుపతి, కోడిమాల శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రెస్‌క్లబ్ సభ్యులు శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు.